సాక్షి
మంచిర్యాల
ఆదివారం । 29 । అక్టోబర్ । 2023



తాయిలమిస్తే తప్పదు శిక్ష

ఎన్నికల నిబంధనలు ఉల్లంఘిస్తే ఎన్నికల సంఘం కఠిన చర్యలు తీసుకుంటుంది. ఎన్నికల్లో ఓట్ల కోసం ఎవరైనా తాయిలాలు ఇస్తే చట్ట ప్రకారం శిక్ష పడే అవకాశాలున్నాయి. 10లో▸



సిద్ధమవుతున్న ప్రమిదలు

దీపావళి పండుగ సమీపిస్తుండడంతో గ్రామాల్లో ప్రమిదల తయారీ ఊపందుకుంది. కుమ్మరులు మట్టితో ప్రమిదలు తయారు చేసి విక్రయించడానికి సిద్ధం చేస్తున్నారు. 11లో▸

గరిష్టం/కనిష్టం
32.0 /19.0

వాతావరణం

ఆకాశం ప్రకాశవంతంగా ఉంటుంది. ఈశాన్యం దిశగా చలిగాలులు వీస్తాయి. గరిష్ట ఉష్ణోగ్రత స్వల్పంగా పెరిగే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు



మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ మోతీలాల్

మంచిర్యాలఅగ్రికల్చర్: ఎన్నికల విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని జిల్లా అదనపు కలెక్టర్ మోతీలాల్ హెచ్చరించారు. శనివారం నస్పూర్‌లోని సమీకృత కలెక్టరేట్ సమావేశ మందిరంలో బెల్లంపల్లి, మంచిర్యాల, చెన్నూర్ నియోజకవర్గాల రిటర్నింగ్ అధికారులు బి.రాహుల్, రాములు, సిడాం దత్తుతో కలిసి మాస్టర్ ట్రైనర్లు, సెక్టార్ అధికారులకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. పోలింగ్ రోజు ప్రతీ 2గంటలకు పోలింగ్ శాతం, పోలైన ఓట్లు, పోలింగ్ ముగిసే సమయానికి ముందు వచ్చి ఉన్న ఓటర్ల విషయంలో పాటించాల్సిన నిబంధనలు, ఓటింగ్ ముగిసిన తర్వాత గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో ఈవీఎంల సీజ్, ఇతరత్రా అంశాలపై అవగాహన కల్పించారు.

'కేసీఆర్ పాలనకు రోజులు దగ్గరపడ్డాయి'



మాట్లాడుతున్న మోహన్ జోషి, వినోద్

బెల్లంపల్లి: ముఖ్యమంత్రి కేసీఆర్ పాలనకు రోజులు దగ్గర పడ్డాయని, త్వరలోనే కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడం తథ్యమని ఏఐసీసీ కార్యదర్శి, బెల్లంపల్లి అసెంబ్లీ నియోజకవర్గ పరిశీలకుడు మోహన్‌జోషి అన్నారు. శనివారం బెల్లంపల్లి పద్మశాలి భవన్‌లో నిర్వహించిన కాంగ్రెస్ పార్టీ అసెంబ్లీ నియోజకవర్గ బూత్ కమిటీల సమావేశంలో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ మేనిఫెస్టోకు ప్రజలు ఆకర్షితులు అవుతున్నారని, కేసీఆర్ విధానాలతో ప్రజలు తీవ్ర వ్యతిరేకతతో ఉన్నారని తెలిపారు. ప్రధానమంత్రి నరేంద్రమోదీ విధానాలు కార్పొరేట్ శక్తులకు అనుకూలంగా ఉన్నాయని విమర్శించారు. బెల్లంపల్లి కాంగ్రెస్ అభ్యర్థి గడ్డం వినోద్‌ను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. ఈ సమావేశంలో కాంగ్రెస్ అభ్యర్థి గడ్డం వినోద్, పార్టీ బెల్లంపల్లి పట్టణ అధ్యక్షుడు మల్లయ్య, ఏఎంసీ మాజీ చైర్మన్ కే.రాంచందర్, మున్సిపల్ మాజీ చైర్మన్ ఎం.సూరిబాబు, నాయకులు ఎం.నర్సింగరావు, ఆర్.సంతోష్, కంకణాల పద్మారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌లో చేరిక

బెల్లంపల్లికి చెందిన సీడీఎస్ రాష్ట్ర మాజీ అధ్యక్షురాలు కంకణాల పద్మారెడ్డి కాంగ్రెస్ పార్టీలో చేశారు. మోహన్ జోషి, గడ్డం వినోద్ ఆమెకు కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.

'ఆదరించండి.. అభివృద్ధి చేస్తా..'



మాట్లాడుతున్న ఎమ్మెల్యే చిన్నయ్య

బెల్లంపల్లిరూరల్: ప్రజలు ఎన్నికల్లో మరోసారి ఆదరిస్తే గ్రామాలను మరింతగా అభివృద్ధి చేస్తానని బీఆర్ఎస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి, బెల్లంపల్లి ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య అన్నారు. శనివారం మండలంలోని లంబాడితండా, గురిజాల, మాలగురిజాల, రంగపేట, దుగ్నెపల్లి, పెర్కపల్లి, బట్వాన్‌పల్లి, మన్నెగూడెం గ్రామాల్లో ఇంటింటా ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఎంపీపీ శ్రీనివాస్, జెడ్పీ వైస్ చైర్మన్ సత్యనారాయణ, సర్పంచ్‌లు రంజిత, రాయమల్లు, సురేష్, ఎంపీటీసీలు సుభాష్, శకుంతల, నాయకుడు గణేష్‌గౌడ్ పాల్గొన్నారు.

సమస్యలపై నిరసన

ఎన్నికల ప్రచారంలో ఎమ్మెల్యే చిన్నయ్యకు నిరసన సెగ తగిలింది. లంబాడితండా నుంచి గురిజాల గ్రామానికి వెళ్తున్న క్రమంలో అదే గ్రామానికి చెందిన కొందరు గ్రామస్తులు గ్రామంలో నెలకొన్న సమస్యలు విన్నవించడానికి వాహనాన్ని అడ్డుకోబోయారు. ఆయన ఆగకుండా వెళ్లడంతో గ్రామస్తులు మండిపడ్డారు.

ధాన్యం సేకరణపై ధ్యాసేది..!



జైపూర్ మండలంలో దిగుబడి దశకు వచ్చిన వరి పంట

- దిగుబడి సమయం సమీపిస్తున్న వేళ
- గత అనుభవాల నుంచి తేరుకునేనా..!
- ఇంకా ఊసే లేని జిల్లా, మండల స్థాయి సమావేశాలు
- ఎన్నికల ప్రక్రియలో అధికారులు బిజీ బిజీ
- రైతులకు ఇబ్బందులు తప్పేనా..

మంచిర్యాలఅగ్రికల్చర్: వానాకాలంలో సాగు చేసిన వరి పంట కోతకు వస్తోంది. జిల్లాలో కొనుగోలు కేంద్రాల ఏర్పాటు, టార్పాలిన్, గన్ని సంచులు, లారీలు సమకూర్చడం, రైస్‌మిల్లులకు ధాన్యం తరలింపు తదితర ఏర్పాట్లపై, రైతులకు ఇబ్బందులు తలెత్తకుండా తీసుకోవాల్సిన చర్యలపై ఏజెన్సీలు, మిల్లర్లు, రవాణా కాంట్రాక్టర్లు, నిర్వాహకులతోపాటు రైతులకు అవగాహన కల్పించాల్సి ఉంది. కొనుగోలు కేంద్రాల నిర్వాహకులతో జిల్లా, మండల స్థాయి ప్రణాళిక సమావేశం ఇప్పటికే ఏర్పాటు చేయాల్సి ఉండగా.. జిల్లా అధికారులు నవంబర్ 30న జరిగే అసెంబ్లీ ఎన్నికల ఏర్పాట్లలో బిజీబిజీగా ఉన్నారు. గత ఏడాది కొనుగోలు కేంద్రాల్లో సకాలంలో ధాన్యం కొనుగోలు చేయక, టార్పాలిన్ కవర్లు సమకూర్చకపోవడం, లారీలు, గన్ని సంచులు అందుబాటులో లేక రోజుల తరబడి రైతులు పడిగాపులు కాయాల్సి వచ్చింది. అకాల వర్షాల వల్ల కొనుగోలు కేంద్రాల్లోని ధాన్యం తడిసిపోయింది. గతంలో ఎదురైన కష్టాలు ఈ ఏడాదీ పునరావృతం అవుతాయేమోనని రైతులు ఆందోళన చెందుతున్నారు. ఈ ఏడాది ముందస్తు ప్రణాళికతో ధాన్యం సేకరణపై అధికారులు దృష్టి సారించి ఇబ్బందులు తలెత్తకుండా సకాలంలో చర్యలు తీసుకోవాల్సి ఉంది. కానీ ఇంతవరకు జిల్లా స్థాయి ఏజెన్సీల సమావేశం నిర్వహించకపోవడంతో నిర్వాహకులు, రైతులు ఆందోళన చెందుతున్నారు. దిగుబడి వచ్చిన ధాన్యం అమ్ముకుని యాసంగి పంటకు సిద్ధం కావాల్సి ఉంది. కొనుగోలు కేంద్రాల ఏర్పాటు ఆలస్యమైతే దళారులను ఆశ్రయించాల్సిన పరిస్థితి ఎదురవుతుంది. అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో గత 20రోజులుగా అధికారులు ఏర్పాట్లలో తీరిక లేకుండా ఉన్నారు. ప్రభుత్వ మద్దతు ధర ఏ గ్రేడ్ ధాన్యానికి క్వింటాల్‌కు రూ.2,203, బీ గ్రేడ్‌సాధారణ రకానికి రూ.2,183 నిర్ణయించారు. ఓ వైపు కొనుగోలు కేంద్రాల ప్రారంభం ఆలస్యమైన కొద్దీ వ్యాపారులకు మేలు చేకూరుతుంది. చలికాలం తేమ ఎక్కువగా వస్తుందని, కోసిన తర్వాత ధాన్యాన్ని పది రోజుల వరకు ఆరబెట్టాలని, అప్పుడే తేమ శాతం 17లోపు ఉంటుందని అధికారులు పేర్కొంటున్నారు.

రెండో వారంలో ప్రారంభం..

ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ధాన్యం సేకరణపై సమావేశం నిర్వహించి నవంబర్ రెండో వారం నుంచి కొనుగోలు కేంద్రాలు ప్రారంభించేందుకు చర్యలు తీసుకుంటున్నాం. ఇప్పుడిప్పుడే కొన్ని చోట్ల దిగుబడి వస్తున్నట్లుంది తేమ శాతం ఎక్కువగా ఉంటుంది. నిబంధనల మేరకు తాలు తప్ప లేకుండా 17శాతం లోబడి ఉండేలా ఆరబెట్టుకోవాలి.

– గోపాల్, జిల్లా పౌర సరఫరాల శాఖ మేనేజర్

3.20లక్షల మెట్రిక్ టన్నుల దిగుబడి అంచనా

గత వానాకాలంలో 1.60లక్షల ఎకరాల్లో వరి సాగు కాగా 244 కొనుగోల కేంద్రాలు ఏర్పాటు చేసి 1,58,336 మెట్రిక్ టన్నుల ధాన్యం రైతుల నుంచి సేకరించారు. ఈ ఏడాది 1,57,443 ఎకరాల్లో వరి సాగు కాగా 3.20 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం దిగుబడి వస్తుందని అధికారులు అంచనా వేస్తున్నారు. ఇందులో సన్నరకం ధాన్యం రైతుల అవసరాలు, విత్తన కంపెనీలకు పోను మిగతా దొడ్డు రకం ధాన్యం 1.80 లక్షల మెట్రిక్ టన్నుల వరకు కొనుగోలు కేంద్రాలకు వస్తుందని పేర్కొంటున్నారు. ఏటా నాణ్యత నిబంధనలు, రవాణా, గన్నిసంచుల కోసం కొనుగోలు కేంద్రాల వద్ద రైతుల పడిగాపులు తప్పడం లేదు. కొనుగోలు కేంద్రాలు పెంచుతున్నా అందుకు తగిన ఏర్పాటు ఉండడం లేదని రైతులు ఆరోపిస్తున్నారు. ఆరంభంలో అడపాదడపా కురిసిన వర్షాలతో నారు పోసుకోగా నీటి సౌకర్యం ఉన్న రైతులు జూలైలో నాట్లు వేశారు. ప్రస్తుతం ఆ వరి కోతకు వచ్చింది. భారీ వర్షాలు కురువడంతో జలాశయాల్లోకి నీరు చేరడంతో పూర్తి స్థాయిలో నాట్లు వేసుకున్నారు. ఆలస్యంగా నాట్లు వేసుకున్న పంట వచ్చే నెల రెండో వారం నుంచి కోతకు వచ్చే అవకాశం ఉంది. ధాన్యం కొనుగోళ్లపై అటు నిర్వాహకులు, ఇటు రైతులకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించకపోవడంతో రైతులు ఇబ్బంది పడాల్సిన పరిస్థితి నెలకొంటుంది. ఇతర జిల్లాల్లో ఇప్పటికే కొనుగోలు కేంద్రాలు ప్రారంభించారు. ధాన్యం సేకరణపై మండల స్థాయి సమావేశాల్లో నిర్వాహకులు, రైతులకు అవగాహన కల్పించాలి. కానీ ఇంతవరకు జిల్లా స్థాయి సమావేశం నిర్వహించలేదు. తేమ శాతం 17లోబడి, చెత్త లేకుండా నిబంధనతో గతేడాది కొనుగోలు చేయలేదు. దీంతో రైతులు 10 నుంచి 20 రోజులపాటు కొనుగోలు కేంద్రాల్లోనే ధాన్యం రాశులు పోసుకొని పడిగాపులు కాయాల్సి వచ్చింది. అకాల వర్షాలకు టార్పాలిన్ కవర్లు అందుబాటులో లేక నానా అవస్థలు పడ్డారు. సరిపడా టార్పాలిన్ కవర్లు లేకపోవడంతో కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం తడిసిపోయింది. ఈ ఏడాదైనా ముందస్తు చర్యలు చేపట్టి ఇబ్బందులు తలెత్తకుండా చూడాలని రైతులు కోరుతున్నారు.

ఘనంగా పౌర్ణమి జాతర



సత్యదేవుణ్ని దర్శించుకుంటున్న కలెక్టర్ దంపతులు

దండేపల్లి: మండలంలోని గూడెం సత్యనారాయణస్వామి ఆలయంలో శనివారం ఆశ్వీయుజ పౌర్ణమి జాతర ఘనంగా నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో సత్యదేవుణ్ని దర్శించుకుని సామూహిక సత్యనారాయణ వ్రతాలు నోముకున్నారు.

కలెక్టర్ దంపతుల పూజలు

సత్యనారాయణస్వామిని కలెక్టర్ బి.సంతోష్ దంపతులు శనివారం దర్శించుకుని పూజలు చేశారు. ఆలయ అధికారులు, అర్చకులు ఆశీర్వచనం చేయగా, ఈవో శ్రీనివాస్ స్వామివారి తీర్థ ప్రసాదాలు అందించి శేషవస్త్రంతో సన్మానించారు.

ఆలయం మూసివేత..

చంద్రగ్రహణం సందర్భంగా ఆలయాన్ని శనివారం సాయంత్రం మూసివేశారు. తిరిగి ఆదివారం సంప్రోక్షణ అనంతరం ఉదయం 8గంటల నుంచి భక్తులను దర్శనానికి అనుమతించనున్నారు.

చెన్నూర్‌ను పట్టించుకోని కాంగ్రెస్

- బీఆర్ఎస్ అభ్యర్థి బాల్క సుమన్



బండి వద్ద మిర్చీలు చేస్తున్న సుమన్

చెన్నూర్: ఐదు దశాబ్దాల కాలం అధికారంలో ఉన్న కాంగ్రెస్ పార్టీ చెన్నూర్ నియోజకవర్గాన్ని పట్టించుకోలేదని చెన్నూర్ బీఆర్ఎస్ అభ్యర్థి, ప్రభుత్వ విప్ బాల్క సుమన్ విమర్శించారు. శనివారం స్థానిక శివాలయంలో ప్రత్యేక పూజల అనంతరం ఎన్నికల ప్రచారం ప్రారంభించారు. శివాలయం నుంచి జలాల్ పెట్రోల్ బంక్ వరకు ప్రధాన రహదారిలో గడప గడపకు ప్రచారం నిర్వహించారు. బీఆర్ఎస్ మేనిఫెస్టో కరపత్రాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ ఐదేళ్ల కాలంలో 20కిపైగా బ్రిడ్జిలు నిర్మించామని, చెన్నూర్ మున్సిపాలిటీలో రూ.200 కోట్లతో అభివృద్ధి చేశామని వివరించారు. ఎంపీపీ మంత్రి బాపు, మాజీ జెడ్పీటీసీ బెల్లంకొండ కరుణసాగర్‌రావు, కౌన్సిలర్లు దోమకొండ అనిల్, జోడు శంకర్, తుమ్మ రమేశ్, వేల్పుల సుధాకర్, నాయిని శ్యామల పాల్గొన్నారు.

'కారు'కు స్పీడ్ బ్రేకర్లు !

- బీఆర్ఎస్ అభ్యర్థులకు ప్రజల్లో చేదు అనుభవాలు
- ఎన్నికల ప్రచారంలో ప్రజల నుంచి వ్యతిరేకత, నిరసనలు
- ఇన్నాళ్లకు గుర్తొచ్చామా..? అంటూ పలు చోట్ల నిలదీతలు
- ఇచ్చిన హామీలు నెరవేరని చోట స్థానికుల ఆగ్రహాలు

సాక్షి ప్రతినిధి, మంచిర్యాల: అధికార బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థులు, సిట్టింగ్ ఎమ్మెల్యేలకు ఎన్నికల ప్రచారంలో చేదు అనుభవాలు ఎదురవుతున్నాయి. అసెంబ్లీ ఎన్నికల్లో పోటాపోటీగా ప్రచారం సాగుతున్న విషయం తెలిసిందే. తమ ప్రాంతంలో అభివృద్ధి చేయడం లేదని, సమస్యలు పరిష్కారం కాలేదని ప్రస్తుత ఎమ్మెల్యేలపై ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికే పలు చోట్ల ఎన్నికల ప్రచారానికి వెళ్లినప్పుడు ఎమ్మెల్యేలను అడ్డుకున్నారు. ఎన్నికల వేళ ప్రజల్లో వ్యతిరేకత బయట పడుతుండడంతో పార్టీ కేడర్‌లో అయోమయం నెలకొంది. వచ్చే ఎన్నికల్లో మళ్లీ తమకే ఓటు వేయాలని ప్రజలకు వివరించేందుకు వెళ్తున్న క్రమంలో ఇన్నాళ్లకు గుర్తొచ్చామా..? అంటూ ప్రజల నుంచి ఆగ్రహావేశాలు వ్యక్తమవుతున్నాయి.

జంగ్ తెలంగాణ

దివాకర్‌రావుపైనా వ్యతిరేకత



మంచిర్యాల నియోజకవర్గంలో స్థానిక ఎమ్మెల్యే, బీఆర్ఎస్ అభ్యర్థి నడిపెల్లి దివాకర్‌రావు ఎన్ని కల ప్రచారానికి వెళ్తే చేదు అనుభవాలు ఎదురవుతున్నాయి. తమ ప్రాంతాన్ని అభివృద్ధి చేయడం లేదంటూ నిలదీస్తున్నారు. ఇటీవల దండేపల్లి మండలం మ్యాదరిపేటలో ప్రచారానికి వెళ్లిన క్రమంలో అభివృద్ధి చేయలేదని నిలదీశారు. జిల్లా కేంద్రంలో పలు వార్డుల్లో స్థానికులు ఎదురు ప్రశ్నించారు. నస్పూర్ పట్టణం సీతారాంపల్లిలో ప్రచారానికి వెళ్లిన సందర్భంలోనూ అక్కడి సమస్యలపై స్థానికులు నిలదీశారు.

హామీలు నెరవేరక..

జిల్లాలో ఇంకా చాలా చోట్ల బీఆర్ఎస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలు పూర్తి స్థాయిలో అమలు కాకపోవడంతో కొన్ని గ్రామాలు, పట్టణాల్లో ఆ పార్టీ అభ్యర్థులపై వ్యతిరేకత వస్తోంది. దీంతో ఎన్నికల ప్రచారానికి వచ్చినప్పుడు స్థానికులు నిలదీస్తున్నారు. ముఖ్యంగా తాగునీరు, రోడ్లు, విద్యుత్, వీధి దీపాలు, సంక్షేమ పథకాల లబ్ధిదారులకు అన్యాయం, ఎంపికలో జాప్యం, తమ కార్యకర్తలకే ఇప్పించుకున్నారనే కోపం ప్రజల్లో ఆగ్రహానికి కారణమవుతున్నాయి. అసెంబ్లీ ఎన్నికల ప్రచారం రోజురోజుకు మరింత వేడి పెరగనున్న నేపథ్యంలో ఇంకా అధికార బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థులకు ప్రజల నుంచి ఎలాంటి ఘటనలు ఎదురవుతాయో వేచి చూడాలి.

సుమన్ ప్రచారం ప్రారంభించిన రోజే..

ఈ నెల 27న చెన్నూరు ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్, బీఆర్ఎస్ అభ్యర్థి బాల్క సుమన్ మందమర్రి పట్టణం పాలచెట్టు వద్ద పంచముఖ ఆంజనేయస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు చేసి ఎన్నికల ప్రచారాన్ని లాంఛనంగా ప్రారంభించారు. అదే రోజు రాత్రి బీఆర్ఎస్ ఎన్నికల ప్రచార రథం ఊరు మందమర్రిలో కళాకారులతో పాటల రూపంలో ప్రచారం చేసేందుకు వెళ్లింది. ఈ ప్రచారాన్ని స్థానికులు అడ్డుకున్నారు. తమకు మిషన్ భగీరథ నీళ్లు, రోడ్లు, మురికి కాలువలు, ఇతర అభివృద్ధి చేయలేదని గ్రామస్తులు వాగ్వాదానికి దిగారు. తాము పార్టీ కార్యకర్తలం కాదని, పాటలు పాడేవాళ్లమని చెప్పినా వినకపోవడంతో చివరకు అక్కడి నుంచి ప్రచారం రథం వెళ్లిపోయింది. అంతకుముందు మంత్రి హరీశ్‌రావు పర్యటన సందర్భంగా కూడా చెన్నూరు పట్టణంలో నిరసనలు జరిగాయి. తాజాగా శనివారం చెన్నూర్ మండలం గంగారం గ్రామంలోనూ బీఆర్ఎస్ ప్రచార రథాన్ని మహిళలు అడ్డుకున్నారు. గ్రామంలో బీటీ రోడ్డు లేదని, సమస్యలు పరిష్కరించాలని నిరసన వ్యక్తం చేశారు.





చిన్నయ్యకు నిరసన సెగలు

బెల్లంపల్లి ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య నియోజకవర్గంలో ప్రచారానికి వెళ్తున్న క్రమంలో నిరసనలు ఎదురవుతున్నాయి. ఇటీవల నెన్నెల మండలం కుశ్నపల్లికి వెళ్తుండగా స్థానిక గిరిజనులు తమ కు పోడు పట్టాలు ఇప్పించడం లేదని ఎమ్మె ల్యే వాహనానికి అడ్డుపడ్డారు. చివరకు పోలీ సులు జోక్యం చేసుకోవడంతో శాంతించారు. తాజాగా శనివారం బెల్లంపల్లి మండలం లంబాడితండాకు సరైన రోడ్డు సౌకర్యం లేదని సొంత పార్టీ నాయకులు, స్థానిక యువకులు ఎమ్మెల్యే వాహనాన్ని అడ్డుకునే ప్రయత్నం చేశారు.

జై బోలో.. కుమురంభీం..!



భీమ్ సమాధి వద్ద నివాళులర్పిస్తున్న కలెక్టర్ హేమంత్ బోర్కడే, అధికారులు

- జోడేఘాట్‌లో ఘనంగా వర్ధంతి
- పోరాట యోధుడికి ఘన నివాళి
- 'కోడ్' కారణంగా తగ్గిన రద్దీ

ఆసిఫాబాద్/కెరమెరి: జల్, జంగల్, జమీన్ కోసం నైజాం ప్రభుత్వంతో పోరాడి అసువులు బాసిన గిరిజన ముద్దుబిడ్డ కుమురంభీంకు ఘన నివాళులర్పించారు. కుమురంభీం జిల్లా కెరమెరి మండలం జోడేఘాట్‌లో శనివారం కుమురంభీం 83వ వర్ధంతిని ఘనంగా నిర్వహించారు. జిల్లా కలెక్టర్ హేమంత్ బోర్కడే, ఐటీడీఏ పీవో చాహత్ బాజ్‌పాయ్, అదనపు కలెక్టర్ దీపక్ తివారి, ఎస్పీ సురేశ్, అడిషనల్ ఎస్పీ అచ్చేశ్వరరావు, డీఎంహెచ్‌వో తుకారాం, ఐటీడీఏ డిప్యూటీ డైరెక్టర్ పీ రమాదేవి, ఏపీవో భాస్కర్, జెడ్పీ చైర్‌పర్సన్ కోవ లక్ష్మి, ఆసిఫాబాద్ ఎమ్మెల్యే ఆత్రం సక్కు, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు అరిగెల నాగేశ్వర్‌రావు, భీం మనుమడు సోనేరావు, లాల్ శావ్, పర్దాన్ పురోహిత్ సంఘం జిల్లా అధ్యక్షుడు పెందోర్ సుధాకర్, తదితరులు హాజరయ్యారు. భీం విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. సమాధిపై పూలు చల్లి మొక్కుకున్నారు. అంతకుముందు నాలుగు గోత్రాల జెండాలకు ప్రత్యేక పూజలు చేశారు. సంప్రదాయం ప్రకారం ఆదివాసీలు డోలు, సన్నాయి వాయించారు. కలెక్టర్ హేమంత్ బోర్కడే భీం వారసులకు దుస్తులు పంపిణీ చేశారు.



నివాళులర్పిస్తున్న పీవో చాహత్‌బాజ్‌పాయ్

భీం ఆశయ సాధనకు కృషి

కుమురంభీం ఆశయ సాధనకు కృషి చేస్తున్నట్లు జెడ్పీ చైర్‌పర్సన్, బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి కోవ లక్ష్మి తెలిపారు. జోడేఘాట్‌లో భీం సమాధి వద్ద ఎమ్మెల్యే ఆత్రం సక్కు, భీం మనుమడు సోనేరావుతో కలిసి నివాళులర్పించారు. అనంతరం కోవ లక్ష్మి, ఆత్రం సక్కు విలేకరులతో మాట్లాడుతూ సీఎం కేసీఆర్ జోడేఘాట్ అభివృద్ధికి రూ.25 కోట్లు కేటాయించి మ్యూజియం, ఆర్చ్ నిర్మించినట్లు గుర్తు చేశారు. ఆదివాసీల సమస్యలు సీఎం కేసీఆర్ దృష్టికి తీసుకువెళ్లి పరిష్కారానికి కృషి చేస్తామని పేర్కొన్నారు. కాగా, ఎన్నికల కోడ్ కారణంగా వర్ధంతి కార్యక్రమానికి జనం తక్కువ సంఖ్యలో హాజరయ్యారు. స్థానిక అధికారులు, ప్రజాప్రతినిధులు మినహా ఉమ్మడి జిల్లా పరిధిలోని మిగతా మూడు జిల్లాల నుంచి ఏ ఒక్క అధికారి, నాయకుడు హాజరు కాకపోవడం గమనార్హం.

బీఆర్ఎస్‌లో జోష్

- ఉట్నూర్, ఆదిలాబాద్‌లో ప్రజా ఆశీర్వాద సభలు సక్సెస్
- పార్టీ శ్రేణుల్లో ఉత్సాహం
- ఉమ్మడి జిల్లాలో పది సీట్లు గెలుస్తామని మంత్రి హరీశ్‌రావు ధీమా

సాక్షి, ఆదిలాబాద్/ఆదిలాబాద్‌టౌన్/ఉట్నూర్‌రూరల్: మంత్రి హరీశ్‌రావు ఆదిలాబాద్ జిల్లా పర్యటన బీఆర్ఎస్ శ్రేణుల్లో ఉత్సాహం నింపింది. జిల్లా కేంద్రంతోపాటు ఉట్నూర్‌లో శనివారం నిర్వహించిన ప్రజా ఆశీర్వాద సభల సక్సెస్‌తో పార్టీ నాయకులు, కార్యకర్తల్లో హుషారు కనిపిస్తోంది. ఉమ్మడి జిల్లాలో పదికి పది సీట్లు గెలుస్తామని హరీశ్‌రావు ఈ సభల్లో ధీమా వ్యక్తం చేశారు. ఆదిలాబాద్, బోథ్, ఖానాపూర్ నియోజకవర్గాల ప్రజలు ఈ సభల్లో పాల్గొనగా బీఆర్ఎస్‌ను గెలిపించాలని, కేసీఆర్‌ను మూడోసారి సీఎం చేయాలన్నారు. అదే సందర్భంలో కేసీఆర్ భరోసా మేనిఫెస్టోను గడపగడపకూ తీసుకెళ్లాలని కార్యకర్తలకు పిలుపు నిచ్చారు.

రెండు సభల్లో..

ఎన్నికల ప్రచారంలో భాగంగా బీఆర్ఎస్ ఆధ్వర్యంలో శనివారం ఉట్నూర్, ఆదిలాబాద్‌లలో ప్రజా ఆశీర్వాద సభలు నిర్వహించారు. ఉదయం హైదరాబాద్ నుంచి హెలికాప్టర్‌లో రాష్ట్ర ఆర్థిక మంత్రి హరీశ్‌రావు ఉట్నూర్ చేరుకున్నారు. శాసనమండలి తొలి చైర్మన్ కే.స్వామిగౌడ్ ఆయనతో ఉన్నారు. స్థానిక కేబీ ప్రాంగణంలో రాష్ట్ర మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి, ఎమ్మెల్సీ దండే విఠల్, జెడ్పీ చైర్మన్ రాథోడ్ జనార్దన్, మాజీ ఎంపీ గోడం నగేశ్, సీనియర్ నాయకులు రవీందర్‌రావు స్వాగతం పలికారు. అక్కడి నుంచి ఎంపీడీవో గ్రౌండ్‌లో ఏర్పాటు చేసిన సభాస్థలికి హరీశ్‌రావు చేరుకున్నారు. వేదిక వద్ద ఆయన ప్రసంగిస్తున్నప్పుడు ఖానాపూర్ అభ్యర్థి భుక్యా జాన్సన్ నాయక్ ఆయన పక్కనే నిల్చుండి ప్రజలకు అభివాదం చేస్తూ కనిపించారు. ఉట్నూర్‌లో గంటలో సభ పూర్తి చేసుకుని ఆదిలాబాద్‌కు చేరుకున్నారు. ఎమ్మెల్యే జోగు రామన్న, బోథ్ నియోజకవర్గ అభ్యర్థి అనిల్ జాదవ్ ఆయనకు స్వాగతం పలికారు. స్థానిక డైట్ మైదానంలో సభలో పాల్గొన్న హరీశ్‌రావు సుదీర్ఘంగా ప్రసంగించారు. 3.15 గంటలకు సభ ముగిసింది.





మాట్లాడుతున్న మంత్రి హరీశ్‌రావు, పక్కన అభ్యర్థులు, సభకు హాజరైన నాయకులు, కార్యకర్తలు

స్థానిక సమస్యలపై ప్రస్తావన

హరీశ్‌రావు తన ప్రసంగంలో స్థానిక సమస్యలపై ప్రస్తావించారు. ఉట్నూర్‌లో పోడు పట్టాల అంశాన్ని ప్రధానంగా వివరించారు. మిగిలిన భూములకు కూడా మళ్లీ సర్వే చేసి పట్టాలు అందిస్తామన్నారు. ఆదిలాబాద్‌లో లోయర్ పెన్‌గంగ డిమాండ్ ఎప్పటి నుంచో ఉందని, కోర్టా–చనాఖా బ్యారేజీను పూర్తి చేయడం ద్వారా ఈ కలను కేసీఆర్ సాకారం చేశారని అన్నారు. కేంద్ర హోంమంత్రి అమిత్‌షా ఆదిలాబాద్‌లో పర్యటించినప్పుడు సీసీఐ గురించి ప్రస్తావించకపోవడంపై హరీశ్‌రావు ఆక్షేపణ వ్యక్తం చేశారు. దాని స్క్రాప్‌ను కూడా అమ్మకానికి పెట్టారని విమర్శించారు. అలాంటి బీజేపీకి ఓట్లు వేయొద్దని అన్నారు. ఈ ఎన్నికల్లో బీజేపీ డకౌట్... కాంగ్రెస్ రనౌట్.. కేసీఆర్ సెంచరీ అంటూ వరల్డ్ కప్ క్రికెట్ పోటీలను అనుకరిస్తూ వివరించడం ద్వారా జనాలను ఆకట్టుకోవాలని చూశారు.

ఆర్ఎస్ఎస్ కార్యకర్తకు టికెట్టు ఇచ్చారు..

కాంగ్రెస్ సెకండ్ లిస్టులో ప్రకటించిన ఆదిలాబాద్ అభ్యర్థిపై హరీశ్‌రావు విమర్శలు ఎక్కుపెట్టారు. ఆర్ఎస్ఎస్ కార్యకర్తకు టికెట్టు ఇచ్చారని పేర్కొన్నారు. తాను చచ్చినప్పుడు కూడా ఆర్ఎస్ఎస్ జెండా కప్పుకుంటానని చెప్పిన వ్యక్తికి ఆదిలాబాద్ కాంగ్రెస్ టికెట్ ఇవ్వడంలో అంతర్యం ఏమిటన్నారు. ఈ ఎన్నికల్లో ఆ అభ్యర్థికి డిపాజిట్ జప్తేనని పేర్కొన్నారు. ఖానాపూర్, ఆదిలాబాద్, బోథ్ అభ్యర్థులు భూక్యా జాన్సన్‌నాయక్, జోగు రామన్న, అనిల్ జాదవ్, డీసీసీబీ చైర్మన్ అడ్డి భోజారెడ్డి, ఆదిలాబాద్ మున్సిపల్ చైర్మ న్ జోగు ప్రేమేందర్, గ్రంథాలయ చైర్మన్ రౌత్ మనోహర్, ఎంపీపీలు పాల్గొన్నారు.

గిరిపుత్రుల అడ్డా బోథ్


సీ.మాధవ్‌రెడ్డి


ఎస్ఏ.దేవుషా


అమర్‌సింగ్ తిలావత్


కాశీరాం




సోయం బాపురావు


రాథోడ్ బాపురావు


గోడం నగేష్


గోడం రామారావు

- మొదట్లో జనరల్.. తదుపరి ఎస్టీ రిజర్వుడ్
- ఇప్పటి వరకు 13 సార్లు ఎన్నికలు

ఇచ్చోడ(బోథ్): పోరాటల గడ్డ బోథ్ నియోజకవర్గం గిరిపుత్రుల అడ్డాగా మారింది. కొండలు, గుట్టల నడుమ అమాయక గిరిజన గ్రామాలు, వాగులు, వంకలు దట్టమైన అటవీ ప్రాంతాల్లో సగానికి పైభాగం ఉన్న ఈ నియోజకవర్గం దశాబ్దాల కాలం నుంచి పోరాటాలకు కేంద్ర బిందువుగా ఉంది. నిజాం కాలంలో పునికి పుచ్చుకున్న చైతన్యం.. మావోయిస్టుల కాలం వరకు ప్రశ్నించేతత్వం, మాడే కడుపులతో సైతం పోరాటబాట వదలని పోరుగడ్డగా చరిత్ర కెక్కింది. 1962లో ఏర్పడ్డ ఈ నియోజకవర్గం మొదటిసారి జరిగిన ఎన్నికల్లో జనరల్ స్థానం కాగా 1967లో జరిగిన పునర్విభజనలో ఎస్టీ రిజర్వ్ అయింది. జనరల్‌లో జరిగిన ఎన్నికల్లో రెడ్డి సామాజిక వర్గానికి చెందిన సీ.మాధవ్‌రెడ్డి ఎన్నిక కాగా తొమ్మిది పర్యాయాలు గోండులు గెలుపొందారు. 1978లో మొదటిసారి లంబాడా వర్గానికి చెందిన అమర్‌సింగ్ తిలావత్, 2014, 2018లో జరిగిన ఎన్నికల్లో రాథోడ్ బాపురావు విజయం సాధించారు.

మొదట్లో జనరల్ ...

- 1962లో మొదటిసారిగా బోథ్ నియోజకవర్గం జనరల్‌స్థానం. తొలిసారి జరిగిన ఎన్నికల్లో నేషనల్ కాంగ్రెస్ నుంచి సీ.మాధవ్‌రెడ్డి గెలుపొందారు. 1967లో ఈ నియోజకవర్గం ఎస్టీకి రిజర్వ్‌డ్ అయింది.
- ఉట్నూర్ కేంద్రంగా పాలన సాగించిన గోండు రాజుల వంశస్తుడు దేవుషా 1967 నుంచి 1977 వరకు రెండు పర్యాయాలు కాంగ్రెస్ అభ్యర్థి గెలుపొందాడు. 1978లో జరిగిన ఎన్నికల్లో కాంగ్రెస్ నుంచి అమర్‌సింగ్ తిలావత్, 1983లో కాంగ్రెస్ అభ్యర్థి కాశీరాం విజయం సాధించారు
- అప్పటి వరకు కాంగ్రెస్ పార్టీకి కంచుకోటగా ఉన్న ఈ నియోజకవర్గంలో టీడీపీ పాగా వేసింది. 1985లో తెలుగుదేశం అవిర్భావంతో కాంగ్రెస్ అభ్యర్థి సిడాం భీంరావుపై టీడీపీ అభ్యర్థి గోడం రామారావు విజయం సాధించారు. ఉపాధ్యాయ వృత్తికి రాజీనామా చేసి గెలిచిన గోడం రామారావు ఎన్టీఆర్ మంత్రివర్గంలో గిరిజన సంక్షేమశాఖ మంత్రిగా పనిచేశారు. ఆ తర్వాత 1989లో జరిగిన ఎన్నికల్లో గోడం రామారావు రెండోసారి టీడీపీ నుంచి ఎమ్మెల్యేగా ఎన్నికై 1994 వరకు కొనసాగారు.
- 1994లో జరిగిన ఎన్నికల్లో రామారావు తనయుడు గోడం నగేష్‌కు టీడీపీ టికెట్ ఇవ్వడంతో విజయం సాధించి గిరిజన సంక్షేమ శాఖ మంత్రిగా పనిచేశారు. 1999లో జరిగిన ఎన్నికల్లో నగేష్ రెండోసారి గెలిచారు.
- 2004లో జరిగిన ఎన్నికల్లో ఉపాధ్యాయ వృత్తికి రాజీనామా చేసి టీఆర్ఎస్ పార్టీ తరపున బరిలోకి దిగిన సోయం బాపురావు చేతిలో నగేష్ ఓటమి పాలయ్యారు. అప్పటి వరకు టీడీపీకి కంచుకోటగా ఉన్న బోథ్ నియోజకవర్గం టీఆర్ఎస్ ఖాతాలోకి వెళ్లింది. ఆ తర్వాత జరిగిన రాజకీయ పరిణామాలతో టీఆర్ఎస్ ఎమ్మెల్యేగా ఉన్న సోయం బాపురావు కాంగ్రెస్‌లో చేరారు.
- 2009లో జరిగిన ఎన్నికల్లో టీడీపీ నుంచి పోటీ చేసిన గోడం నగేష్ విజయం సాధించారు. 2014 ఎన్నికల కంటే కొద్దిరోజుల ముందు నగేష్ టీఆర్ఎస్‌లో చేరారు. దీంతో బోథ్ రాజకీయాల్లో మార్పులు జరిగాయి. గోడం నగేష్‌కు టీఆర్ఎస్ ఆదిలాబాద్ పార్లమెంట్ టికెట్ ఇవ్వగా స్థానికేతరుడైన రాథోడ్ బాపురావుకు బోథ్ అసెంబ్లీ టికెట్ కట్టాబెట్టారు.
- 2014లో జరిగిన ఎన్నికల్లో కాంగ్రెస్ నుంచి అనిల్‌జాదవ్, టీడీపీ నుంచి సోయం బాపురావు, టీఆర్ఎస్ నుంచి రాథోడ్ బాపురావు పోటీలో నిలవగా రాథోడ్ బాపురావు విజయం సాధించారు. 2018 ముందస్తు ఎన్నికల్లో టీఆర్ఎస్ నుంచి రాథోడ్ బాపురావు, కాంగ్రెస్ నుంచి సోయం బాపురావు, స్వతంత్ర అభ్యర్థులుగా అనిల్‌జాదవ్ పోటీలో నిలవగా టీఆర్ఎస్ అభ్యర్థి రాథోడ్ బాపురావు విజయం సాధించారు.

నియోజకవర్గంలో ఓటరు వివరాలు	
మొత్తం ఓటర్లు	2,06,700
పురుషులు	1,00,656
మహిళలు	1,06,031
ఇతరులు	13

మంత్రి పదవులు

నియోజకవర్గంలో మొదటిసారిగా 1975లో జరిగిన ఎన్నికల్లో కాంగ్రెస్ నుంచి గెలుపొందిన అమర్‌సింగ్ తిలావత్ 6 నెలల పాటు టూరిజం శాఖ మంత్రిగా, 1985లో గెలుపొందిన గోడం రామారావు టీడీపీ హయాంలో గిరిజన సంక్షేమశాఖ మంత్రిగా, 1994లో టీడీపీ నుంచి గెలుపొందిన గోడం నగేష్ గిరిజన సంక్షేమశాఖ మంత్రిగా పనిచేశారు.

పునర్విభజనతో మార్పులు...

నియోజకవర్గం ఏర్పాటు నుంచి బోథ్‌లో బోథ్, ఇచ్చోడ, గుడిహత్నూర్, నేరడిగొండ, బజార్‌హత్నూర్, ఇంద్రవెల్లి, నార్నూర్ మండలాలు ఉండేవి. 2009 పునర్విభజనలో ఇంద్రవెల్లి మండలం ఖానాపూర్‌లో, నార్నూర్ మండలాన్ని ఆసిఫాబాద్‌లో కలిపారు. ఆదిలాబాద్ నియోజకవర్గంలో ఉన్న తాంసి, తలమడుగు మండలాలను బోథ్ అసెంబ్లీ నియోజకవర్గంలో కలిపారు. ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం ఏర్పాటు తర్వాత ఏడు మండలాలతో ఉన్న నియోజకవర్గం ప్రస్తుతం నూతనంగా భీంపూర్, సోనాల, సిరికొండ మండలాల ఏర్పాటుతో పది మండలాలతో కొనసాగుతోంది.

తాయిలమిస్తే తప్పదు శిక్ష ..

- ఎన్నికల నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు
- భారతీయ శిక్షాస్మృతి, ప్రాతినిధ్య చట్టం కింద జైలు, జరిమానా

నిర్మల్‌చైన్‌గేట్/నిర్మల్‌ఖిల్లా: రాష్ట్ర అసెంబ్లీకి నవంబర్ 30న ఎన్నికలు జరగనున్నాయి. ఈ ఎన్నికల్లో విజయం సాధించేందుకు అభ్యర్థులు చేయని ప్రయత్నమంటూ ఉండదు. ఓటర్లను ప్రసన్నం చేసుకోవడానికి అనేక రకాల తాయిలాలు అందిస్తుంటారు. ఓటర్లను ఎలాంటి ప్రలోభాలకు గురిచేసినా ఎన్నికల చట్టం ప్రకారం నేరమే. ప్రభావితం చేసిన వారిపై భారతీయ శిక్షాస్మృతి ప్రజా ప్రాతినిధ్య చట్టం రింజేటేషన్ ఆఫ్ పీపుల్ -యాక్ట్)-1951, ఎక్సైజ్ చట్టం 1968 ప్రకారం పలు రకాల కేసులు నమోదు చేస్తారు. ఎన్నికల విధుల్లో ఉన్న అధికారులు నిబంధనలు ఉల్లంఘించినా వారిపై చర్యలు తప్పవు. జరిమానాతో పాటు జైలుశిక్ష పడే అవకాశం కూడా ఉంది. ఎన్నికలు పారదర్శకంగా జరగాలంటే, ధన ప్రభావం తగ్గాలంటే, ఉత్తమ అభ్యర్థులు గెలవాలంటే అక్రమాలపై పౌరులు కూడా ఆధారాలతో ఫిర్యాదు చేయాలి. ఈ నేపథ్యంలో ఏయే నేరాలకు ఎలాంటి శిక్షలు, జరిమానాలు విధిస్తారో తెలుసుకుందాం.

మద్యం పంపిణీ చేస్తే..

ఎన్నికల్లో ఓటర్లను ప్రసన్నం చేసుకోవడానికి మద్యం పంపిణీ చేస్తుంటారు. అనుమతి లేకుండా పరిమితికి మించి మద్యం నిల్వ ఉంచుకున్నా, విక్రయించినా, ఓటర్లకు పంపిణీ చేసినా కేసు నమోదు చేస్తారు. ఓటర్లకు సారా, కల్లు, మద్యం, ఇతర మత్తు పదార్థాలు ఇస్తే నేరమే అవుతుంది. పట్టుబడిన సారా, మద్యాన్ని బట్టి ఎక్సైజ్ చట్టం-1968 సెక్షన్ 34 (ఎ) ప్రకారం ఆరు నెలల నుంచి ఏడాది వరకు జైలుశిక్ష, రూ.5 వేల నుంచి రూ.20వేల వరకు జరిమానా విధిస్తారు.

ఓటర్లకు డబ్బులు పంచితే..

ఎన్నికల్లో గెలిచేందుకు అభ్యర్థులు ఓట్లను నోట్లతో కొనుగోలు చేసే ప్రయత్నం చేస్తారు. ఓటర్లకు డబ్బులు పంపిణీ చేసేటప్పుడు పట్టుబడితే ఐపీసీ-171 (ఇ) ప్రకారం ఏడాది జైలుశిక్షతో పాటు జరిమానా విధించే అవకాశం ఉంటుంది. ప్రజా ప్రతినిధ్య చట్టం ప్రకారం కూడా శిక్షలు అమలు చేస్తారు.

విద్వేషపూరిత ప్రసంగాలు చేస్తే...

ఎన్నికల్లో లబ్ధిపొందేందుకు వర్గాల మధ్య శతత్వాన్ని పెంచేలా విద్వేష పూరిత ప్రసంగాలు చేస్తే వారిపై ప్రజా ప్రాతినిధ్య చట్టం (ఆర్పీయాక్ట్) 125 నిబంధన ప్రకారం మూడేళ్ల జైలుశిక్ష లేదా జరిమానా ఉంటుంది. రెండూ కూడా విధించవచ్చు. ఎవరూ మతాలు, వర్గాలను కించపరిచేలా, మనోభావాలు దెబ్బతీసేలా మాట్లాడొద్దు.



ఎన్నికల నియమావళి ప్రకారం వీటిపై చర్యలు

బెదిరింపులకు పాల్పడితే...

ఎన్నికల్లో తమకే ఓటు వేయాలని అభ్యర్థులు, పార్టీల నాయకులు ఓటర్లను బెదిరించకూడదు. ఓటర్లను బెదిరిస్తే ఐపీసీ సెక్షన్ 171 (సీ) ప్రకారం కేసు నమోదు చేస్తారు. ఏడాది జైలుశిక్షతో పాటు, జరిమానా కూడా విధించవచ్చు. రెండూ విధించే అవకాశం కూడా ఉంది.

కానుకలు ఇస్తే..

ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థులతో పాటు పార్టీ నాయకులు, కార్యకర్తలు ఓటర్లను ఆకర్షించడానికి కానుకలు అందించినా నేరమే. మహిళలకు చీరలు, గృహోపకరణాలు ఇవ్వడం, యువకులకు క్రీడా కిట్లు, చరవాణులు ఇలా ఏమిచ్చినా ఐపీసీ సెక్షన్ 171 (ఈ) ప్రకారం ఏడాది జైలుశిక్షతో పాటు జరిమానా విధిస్తారు.

అబద్ధాలతో ప్రచారం చేస్తే..

ఎన్నికల్లో పోటీ చేస్తున్న అభ్యర్థులు అబద్ధాలు చెబుతూ ప్రచారం చేస్తే అదికూడా నేరమే అవుతుంది. లేని వాటిని ఉన్నట్లు చెప్పడం, పోటీ చేసే రాజకీయ ప్రత్యర్థిపై తీవ్రమైన నిందలు వేస్తూ అబద్ధాలు చెప్పడం నేరంగా పరిగణిస్తారు. అందుకు ఐపీసీ సెక్షన్ 171 (జీ) ప్రకారం జరిమానా విధిస్తారు.

దొంగ ఓట్లు వేస్తే...

ఎన్నికల్లో ఒకరి ఓటు మరొకరు వేస్తుంటారు. ఇలాంటి వాటినే దొంగఓట్లు అంటారు. తర్వాత వచ్చిన అసలు ఓటరు తన ఓటు ఎవరో వేశారని తెలిసి అవాక్కవుతాడు. ఇలా దొంగ ఓట్లు వేయించినా, వేసినా చట్ట ప్రకారం నేరమే అవుతుంది. దీనికి ఐపీసీ సెక్షన్ 171 (ఎఫ్) ప్రకారం ఏడాది జైలుశిక్షతో పాటు జరిమానా విధిస్తారు.

వ్యక్తి అదృశ్యం


బీరయ్య (ఫైల్)

లక్సెట్టిపేట: మండలంలోని వెంకట్రావుపేట గ్రామానికి చెందిన బీరయ్య (38) కొద్దిరోజులుగా కనిపించడంలేదని ఎస్సై లక్ష్మణ్ తెలిపారు. ఈ నెల 24న ఇంటి నుంచి బయటకు వెళ్లిన బీరయ్య ఇప్పటి వరకు ఇంటికి రాలేదు. కుటుంబ సభ్యులు తెలిసిన చోట్ల వెతికినా ఆచూకీ లభించలేదు. శనివారం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

భారీగా దేశీదారు పట్టివేత

జైపూర్(చెన్నూర్): మహారాష్ట్రలోని చంద్రపూర్ నుంచి మంచిర్యాల జిల్లా చెన్నూర్ మీదుగా పెద్దపల్లి జిల్లా గుంజపడుగు గ్రామానికి అక్రమంగా తరలిస్తున్న దేశీదారు మద్యాన్ని శనివారం జిల్లా ఎస్ఎస్‌టీ బృందం, ఎక్సైజ్‌శాఖ పోలీసులు పట్టుకున్నారు. చంద్రపూర్‌కు చెందిన ఆరే శ్రీనివాస్, ఆరే భాగ్యవతి, ఆమోల్ అశోక్ చంద్రపూర్‌లో 292 దేశీదారు బాటిళ్లను (90 ఎంఎల్) మహేంద్ర టీయూవీ-300 వాహనంలో తరలిస్తుండగా పార్వతి బ్యారేజీ వద్ద ఎస్ఎస్‌టీ బృందం, ఎక్సైజ్‌శాఖ పోలీసులు వాహనాలు తనిఖీ చేస్తుండగా పట్టుబడ్డారు. నిందితులను విచారించగా చంద్రపూర్‌లో మద్యం కొనుగోలు చేసి మంథని మండలం గుంజపడుగులో జరిగే ఓ శుభకార్యానికి తీసుకెళ్తున్నట్లు ఒప్పుకున్నారు. మద్యం, వాహనాన్ని స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు తెలిపారు. మద్యం విలువ రూ.5లక్షల 8వేలు ఉంటుందన్నారు. ఈ తనిఖీల్లో ఎస్ఎస్‌టీ అధికారి, ఇన్‌స్పెక్టర్ టి.నరేందర్, సబ్ ఇన్‌స్పెక్టర్ జి.జీవన్‌రెడ్డి, ఎస్ఎస్‌టీ, ఎక్సైజ్‌శాఖ కానిస్టేబుళ్లు రవీందర్‌రెడ్డి, మహేశ్, రాజేంద్రప్రసాద్, ఉమారాణి, తదితరులు పాల్గొన్నారు.


పట్టుకున్న మద్యంతో ఎక్సైజ్, ఎస్ఎస్‌టీ బృందం

పత్తి చేనుపై గడ్డిమందు పిచికారీ

- నీటిలో గడ్డిమందు కలిపిన గుర్తు తెలియని వ్యక్తులు
- పోతన్‌పల్లిలో ఘటన

భీమారం(చెన్నూర్): మండలంలోని పోతన్‌పల్లికి చెందిన దరావత్ రమాదేవి తమ పత్తి చేనుకు పూత మందు పిచికారీ చేసేందుకు గురువారం సాయంత్రం పంటచేనులోని డ్రమ్మును నీటితో నింపి ఉంచింది. గుర్తు తెలియని వ్యక్తులు ఆ నీటిలో గడ్డిమందు కలిపారు. శుక్రవారం అదే నీటిలో పురుగుల మందు కలిపి పంటచేనుకు స్ప్రే చేశారు. రమాదేవి కుమారుడు నవీన్ శనివారం మధ్యాహ్నం చేను పరిశీలించేందుకు వెళ్లగా మొక్కలు చనిపోయి కనిపించడంతో గ్రామస్తులకు సమాచారం అందించాడు. రమాదేవి భర్త రాజేశ్ నాలుగు నెలల క్రితమే మృతి చెందగా కుమారుడి సాయంతో ఎకరం విస్తీర్ణంలో పత్తి సాగు చేసింది. ఈ తరుణంలో గుర్తు తెలియని దుండగులు కావాలనే డ్రమ్ము నీటిలో గడ్డిమందు మందు కలిపారని బాధితులు వాపోయారు. నిందితులపై చర్యలు తీసుకోవాలని పోలీసులను కోరుతున్నారు.


ఎండిన పత్తి మొక్కలు చూపిస్తున్న నవీన్

వికటించిన ఆర్ఎంపీ వైద్యం

- జ్వరంతో నాలుగేళ్ల చిన్నారి మృతి
- ఆలస్యంగా వెలుగులోకి ఘటన


ఆధ్యశ్రీ (ఫైల్)

కౌటాల: ఆర్ఎంపీ వైద్యం వికటించి చిన్నారి మృతి చెందిన ఘటన శనివారం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. బాధిత కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని తుమ్మిడిహెట్టి గ్రామానికి చెందిన గోంగ్లె బండు-చైతన్య దంపతుల కుమార్తె ఆధ్యశ్రీ (04)కి ఈ నెల 24న జ్వరం రావడంతో మండల కేంద్రంలోని నదిమాబాద్ కాలనీకి చెందిన ఆర్ఎంపీ వైద్యుడు అల్లూరి మారుతి వద్దకు తీసుకెళ్లారు. వైద్యుని సూచన మేరకు స్థానిక ల్యాబ్‌లో రక్త పరీక్షలు చేయించగా టైఫాయిడ్ నిర్ధారణ అయ్యింది. మూడు రోజుల పాటు కోర్సు వాడాలని చెప్పడంతో పాప చేతికి కైన్లా వేసి మూడు రోజుల పాటు ఇంజక్షన్లు వేశాడు. ఈ నెల 26న తుమ్మిడిహెట్టిలోని వారి ఇంట్లో చిన్నారికి గ్లూకోజ్ పెట్టి ఆర్ఎంపీ వెళ్లిపోయాడు. ఒక్కసారిగా ఫిట్స్‌తో పాటు ఒంటిపై దద్దుర్లు వచ్చాయి. చలితో వణుకుతుండడంతో విషయం ఆర్ఎంపీకి ఫోన్ చేయగా స్పందించలేదు. దీంతో కుటుంబ సభ్యులు కాగజ్‌నగర్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు పాపకు హెవీడోస్ ఇచ్చారని, పరిస్థితి విషమంగా ఉందని చెప్పారు. చికిత్స అందించేందుకు యత్నించగా పరిస్థితి విషమించి చిన్నారి మృతి చెందింది.

ఆర్ఎంపీపై చర్యలు తీసుకోవాలి

బాధిత కుటుంబ సభ్యుల ఆందోళన మేరకు ఆర్ఎంపీ రూ.3 లక్షల పరిహారం అందిస్తానని హామీ ఇవ్వడంతో చిన్నారి అంత్యక్రియలు పూర్తి చేశారు. ఆ తర్వాత ఆర్ఎంపీని సంప్రదించగా మాట మార్చాడు. తమ కుమార్తెకు మృతికి కారణమైన ఆర్ఎంపీపై చట్టరీత్యా చర్యలు తీసుకోవాలని మృతురాలి తండ్రి బండు కోరుతున్నాడు. దీనిపై పోలీసులకు ఫిర్యాదు చేయనున్నట్లు తెలిపాడు.

ఓటు నమోదుకు మూడు రోజులే..

మంచిర్యాలటౌన్: 18 ఏళ్లు నిండినవారు ఓటరుగా నమోదు చేసుకునేందుకు మరో మూడు రోజులు మాత్రమే సమయం మిగిలి ఉంది. అక్టోబర్ 1 నాటికి 18 ఏళ్లు నిండిన వారంతా ఓటు కోసం దరఖాస్తు చేసుకునేందుకు ఈ నెల 31 వరకు కేంద్ర ఎన్నికల సంఘం అవకాశం కల్పించింది. అర్హులు బూత్ లెవల్ అధికారులను లేదా ఆన్‌లైన్ వెబ్‌సైట్ల ద్వారా నమోదు చేసుకోవచ్చు.

క్రీడానైపుణ్యం మెరుగుపర్చుకోవాలి


క్రీడాకారులతో డీజీఎం సివిల్ సతీష్‌బాబు


రెబ్బెన(ఆసిఫాబాద్): సింగరేణి సంస్థ కల్పిస్తున్న సౌకర్యాలు సద్వినియోగం చేసుకుంటూ క్రీడాకారులు తమ క్రీడా నైపుణ్యాలు మరింత మెరుగుపర్చుకోవాలని డీజీఎం సివిల్ సతీష్‌బాబు అన్నారు. 90వ డబ్ల్యూపీఎస్ వార్షిక క్రీడల్లో భాగంగా శనివారం గోలేటి టౌన్‌షిప్ లోని భీమన్న స్టేడియంలో డిపార్టుమెంటల్ క్రికెట్ పోటీలు నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన డీజీఎం మాట్లాడుతూ క్రీడలతో స్నేహభావం పెరుగుతుందన్నారు. కోల్ ఇండియా పోటీల్లో సింగరేణి సత్తా చాటాలని కోరారు. అనంతరం క్రీడాకారులను పరిచయం చేసుకుని పోటీలను ప్రారంభించారు. ఈ సందర్భంగా నిర్వహించిన పోటీలో ఖైరిగూడ పీవో జట్టుపై ఎస్వోటూ జీఎం గ్రూప్ జట్టు 7 వికెట్ల తేడాతో విజయం సాధించింది. ఈ కార్యక్రమంలో సీనియర్ పర్సనల్ అధికారి ప్రశాంత్, స్పోర్ట్స్ కోఆర్డినేటర్ మురహరిరావు, జనరల్ కెప్టెన్ చంద్ర కుమార్, క్రీడాకారులు పాల్గొన్నారు.

రక్షణతో కూడిన ఉత్పత్తి సాధించాలి

కాసిపేట(బెల్లంపల్లి): సింగరేణి కార్మికులు రక్షణతో కూడిన బొగ్గు ఉత్పత్తి సాధించాలని రక్షణ బృందం కన్వీనర్, జీఎం డైరెక్టర్ పీఅండ్‌పీ నాగేశ్వర్‌రావు, సేఫ్టీ జీఎం కార్పొరేట్ గురువయ్య అన్నారు. 54వ రక్షణ పక్షోత్సవాల్లో భాగంగా శనివారం మందమర్రి ఏరియాలోని కాసిపేట 2 గనిని సేఫ్టీ కమిటీ బృందం తనిఖీ చేసింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ ఏడాది సంస్థలో రికార్డు స్థాయిలో తక్కువ ప్రమాదాలు నమోదయ్యాయని, ఇందుకు కృషి చేసిన అధికారులను అభినందించారు. కమ్యూనికేషన్ సెల్ ఆధ్వర్యంలో హెల్మెట్ ప్రాముఖ్యతను వివరిస్తూ నాటికను ప్రదర్శించారు. ఈ కార్యక్రమంలో ఏరియా జీఎం మనోహర్, బెల్లంపల్లి రీజనల్ సేఫ్టీ జీఎం కేహెచ్ గుప్తా, ఏరియా రక్షణాధికారి రవీందర్, అడిషనల్ మేనేజర్ ప్రాజెక్ట్ అండ్ ప్లానింగ్ ప్రవీణ్ విక్రం, గ్రూప్ ఏజెంట్ రాందాస్, కేకే గ్రూప్ ఇంజనీర్ రాందాస్, గని మేనేజర్ లక్ష్మీనారాయణ, సంక్షేమాధికారి భార్గవ్, రక్షణ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

మహిళ మృతికి కారణమైన ఆర్ఎంపీ రిమాండ్

చింతలమానెపల్లి: మండలంలోని బూరెపల్లి గ్రామానికి చెందిన ఆర్ఎంపీ వైద్యుడు గుర్లె గణేశ్‌ను శనివారం పోలీసులు రిమాండ్‌కు తరలించారు. కోర్సిని గ్రామానికి చెందిన దన్నూరి పుష్పలతకు జ్వరం రావడంతో ఆర్ఎంపీ వైద్యుడు గణేశ్ చికిత్స అందించాడు. వైద్యం వికటించడంతో మహిళ మృతి చెందింది. శుక్రవారం పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైంది. నిందితుడిని అరెస్టుచేసి కోర్టులో హాజరు పర్చగా జడ్జి 13రోజుల రిమాండ్ విధించినట్లు ఎస్సై వెంకటేశ్ తెలిపారు.





కొనసాగుతున్న పోలీసు అమరవీరుల వారోత్సవాలు

మంచిర్యాలరూరల్(హాజీపూర్): గుడిపేట 13వ ప్రత్యేక పోలీసు బెటాలియన్‌లో పోలీసు అమరవీరుల సంస్మరణ వారోత్సవాలు కొనసాగుతున్నాయి. శనివారం కమాండెంట్ సయ్యద్ జమీల్‌భాషా పర్యవేక్షణలో పోలీసు బ్యాండ్ సిబ్బంది ఎల్లంపల్లి ప్రాజెక్టుపై అమరులను స్మరిస్తూ స్ఫూర్తి, విషాద గీతాలు ఆలపించారు. గాయకులు గురువయ్య, శివప్రియలను అభినందిస్తూ జ్ఞాపికలు అందజేశారు. బెటాలియన్ అసిస్టెంట్ కమాండెంట్ రఘునాథ్‌చౌహాన్, ఆర్ఐలు కుమారస్వామి, శ్రీనివాస్, మారుతి, గోపి, రవి, ఆర్ఎస్సైలు, బెటాలియన్ సిబ్బంది పాల్గొన్నారు.


పోలీస్ బ్యాండ్‌తో కమాండెంట్ జమీల్‌భాషా